క్లుప్తంగా

డీఏఓగా నిరంజన్ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్(డీఏఓ)గా ఎం నిరంజన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆర్డీఓ మధులతను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరారు.

ఉదయగిరి తహసీల్దార్‌గా సుభద్ర



ఉదయగిరి: మండల తహసీల్దార్‌గా ఎం సుభద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చిన తహసీల్దార్ నెహ్రూబాబు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉన్నతాధికారులు సుభద్రను నియమించారు.

ఆత్మకూరు తహసీల్దార్‌గా సుధీర్



ఆత్మకూరురూరల్: మండల నూతన తహసీల్దార్‌గా సుధీర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఏఎస్‌పేట తహసీల్దార్‌గా శ్రీరాంకృష్ణ



అనుమసముద్రంపేట: మండల తహసీల్దార్‌గా డీ శ్రీరాంకృష్ణ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో కలిగిరి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా మాచవరం తహసీల్దార్‌గా వెళ్లారు. అనంతరం జరిగిన బదిలీల్లో భాగంగా ఏఎస్‌పేటకు వచ్చారు. నూతన తహసీల్దార్‌కు డీటీ వెంకటేశ్వర్లు ,రెవెన్యూ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కలిగిరి సీఐగా వెంకటనారాయణ



కలిగిరి: కలిగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పీ వెంకటనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని కలిగిరి, వింజమూరు, జలదంకి, కొండాపురం మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, పేకాట, కోడిపందేలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జలదంకి: జిల్లాలోని 108 వాహనాల్లోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ), పైలట్ (డ్రైవర్) ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు 108 సేవల జిల్లా మేనేజర్ విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీకు జీఎన్‌ఎం, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, తదితర కోర్సులు చేసినవారు అర్హులని తెలిపారు. పైలట్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన 35 ఏళ్లలోపు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నెల్లూరు దిశ పోలీస్‌స్టేషన్ పక్కనున్న 108 కార్యాలయంలో ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉదయగిరిలో 45.4 మి.మీ వర్షపాతం

ఉదయగిరి: ఉదయగిరిలో బుధవారం వేకువజామున 45.4 మి.మీ వర్షపాతం కురిసింది. వర్షం కారణంగా డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగు ప్రవహించడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాగా ఖరీఫ్, ఉద్యాన పంటలకు వర్షం కొంత ఊరటనిచ్చింది.

డంపింగ్ యార్డ్‌ల పరిశీలన

కలిగిరి: వెలగపాడు, కలిగిరిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఈఓపీఆర్డీ వెలుగోటి మధు బుధవారం పరిశీలించారు. మండలంలోని సంపద తయారీ కేంద్రాలను సర్పంచ్‌ల సహకారంతో వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణారెడ్డి ఉన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ల ధర్నా

సోమశిల: రాజకీయ ఒత్తిళ్లతో అక్రమంగా తమను తొలగించొద్దని కోరుతూ సీఐటీయూ, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో మండల పరిషత్‌కార్యాలయం ఎదుట ఫీల్డ్‌అసిసెంట్లు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ తాజ్‌మన్సూర్, ఉపాధి ఏపీఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ అనంతసాగరం మండలంలో 25 మంది ఫీల్డ్‌అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారి నుంచి ఎలాంటి సంజాయిషీలు అడగకుండా రాజకీయ ఒత్తిళ్లతో తొలగిస్తున్నామని అధికారులు చెప్పడం దుర్మార్గమన్నారు.

11నుంచి వెంకయ్యస్వామి ఆరాధన ఉత్సవాలు

చేజర్ల: నాగులవెల్లటూరులో భగవాన్ వెంకయ్యస్వామి 38వ ఆరాధన ఉత్సవాలను ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వేలూరు కేశవచౌదరి బుధవారం తెలిపారు.

ఇక రేషన్ మోతే

రేషన్ బండ్లకు మంగళం

- రేషన్ షాపులకు వెళ్లేనే సరుకులు
- మజరా గ్రామాల ప్రజలకు మళ్లీ పాతకష్టాలు
- ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా వ్యతిరేకత
- పాత విధానాన్ని కొనసాగించాలని వేడుకోలు



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్(ఫైల్)

సాక్షి నెట్‌వర్క్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసింది. పేదల రేషన్ తిప్పలను గమనించి వాటిని తీర్చాలని భావించింది. రేషన్ సరుకులు సైతం పక్కదారి పట్టకుండా ఎండీయూ వాహనాల ద్వారా డోర్ డెలివరీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం పునరాలోచన చేసి పాత విధానాన్నే కొనసాగించాలని కోరుతున్నారు. గతంలో రేషన్‌షాపుల వద్దే రేషన్ సరుకులు అందజేసేవారు. అప్పట్లో లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. పంచాయతీ పరిధిలోని ఎక్కడో ఒక చోట రేషన్ దుకాణం ఉండేది. మజరా గ్రామాలకు చెందిన ప్రజలు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ షాపు వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. అక్కడికి రవాణా సౌకర్యం సరిగా లేని గ్రామాల ప్రజలు నడుచుకుంటూ వెళ్లి సరుకులు తెచ్చుకునేందుకు అవస్థలు పడేవారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు సరుకులు తెచ్చుకునేందుకు నానా పాట్లు పడేవారు. కూలీలు ఒక్కరోజు మొత్తం పనులు మానుకుని వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చేది. రేషన్ డీలర్లు అందుబాటులో లేకపోతే రెండు, మూడుసార్లు తిరగాల్సిన పరిస్థితులు ఉండేవి. రేషన్ ఎప్పటి నుంచి ఇస్తున్నారో కూడా సరిగా సమాచారం ఉండేది కాదు. కొందరు డీలర్లు రేషన్ సరుకులను సైతం పక్కదారి పట్టించేవారు. ఈ సమస్యలను గుర్తించిన గత ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ఇంటి వద్దే రేషన్ అందించాలని సంకల్పించింది. అదే క్రమంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని 2021 ఫిబ్రవరిలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. అప్పట్నుంచి ఇంటి వద్దే రేషన్ సరుకుల అందజేస్తుండడంతో లబ్ధిదారులకు తిప్పలు తప్పాయి. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా మజరా గ్రామాల ప్రజలు, కూలీలు పాత కష్టాలను తలుచుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, దివ్యాంగులు తాము ఎలా సరుకులు తెచ్చుకోవాలని ఆవేదన చెందుతున్నారు. పేదల కష్టాలను గమనించి ప్రభుత్వం పాత విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కావలి నియోజకవర్గ సమాచారం

మండలం	రేషన్ దుకాణాలు	రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు
కావలి	75	44,336	27
బోగోలు	38	15,141	10
దగదర్తి	33	12,457	7
అల్లూరు	35	17,136	10
మొత్తం	181	89,070	54
ఆత్మకూరు నియోజకవర్గ సమాచారం			
ఆత్మకూరు	37	18,898	13
అనంతసాగరం	37	13,948	8
ఏఎస్‌పేట	26	10,788	7
చేజర్ల	36	11,252	8
మర్రిపాడు	35	13,834	8
సంగం	33	14,585	9
మొత్తం	204	83,305	53
ఉదయగిరి నియోజకవర్గ సమాచారం			
ఉదయగిరి	38	10,722	6
వరికుంటపాడు	34	9,346	6
కలిగిరి	35	1,4741	8
సీతారామపురం	24	7,144	5
దుత్తలూరు	22	8,222	5
జలదంకి	33	15,167	9
వింజమూరు	26	12,766	7
కొండాపురం	34	12,456	8
మొత్తం	246	90,564	54

వృద్ధులకు కష్టమే



ఇంటి ముందుకే బండి వచ్చి రేషన్ సరుకులు ఇచ్చిపోతుండడంతో నాలాంటి వృద్ధులకు ఎంతో సౌకర్యంగా ఉంది. బండిని తీసేస్తే రేషన్‌షాపుకు వెళ్లి సరుకులు మోసకొచ్చుకోవడం నాలాంటి వాళ్లకు కష్టమే. సరుకులు ఎప్పుడిస్తున్నారో ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. డీలర్ ఉన్నప్పుడే వెళ్లాలి. డీలర్ లేకపోతే మళ్లీ మళ్లీ తిరగడం కష్టం. ఇంటి వద్దే సరుకులు ఇవ్వాలి.

–భూదేవి, కావలి

పనులు మానుకుని తెచ్చుకోవాలి



రోజూ కూలీ పనులకు వెళ్తే కాని కుటుంబం గడవదు. ఇప్పటి వరకు రేషన్ బండి ఇంటి వద్దకు వచ్చి ఇస్తుండడంతో ఇంట్లో నేను, నా భార్య లేకపోయినా పిల్లలు అయినా సరుకులు తీసుకుంటున్నారు. రేషన్ బండి తీసేస్తే మాలాంటి పనులకు వెళ్లే వారికి ఇబ్బందే. రేషన్ షాపులో ఇస్తే పనులు మానుకుని వెళ్లి తెచ్చుకోవాల్సిందే.

– రమేష్, కావలి

ఇంటి వద్దే అందజేయాలి



నేను అనారోగ్యంతో ఒంటరిగా జీవిస్తున్నాను. నాకు రేషన్ బియ్యం, పింఛనే ఆధారం. ఇంతకుముందులా బండి ద్వారా ఇంటి వద్దే రేషన్ బియ్యం అందజేయాలి. రేషన్ షాపు వద్దకు వెళ్లి తెచ్చుకోవాలంటే కష్టమే. ఆటో తీసుకుని వెళ్లాలంటే రూ.200కుపైగా ఖర్చు అవుతుంది.

– చాట్ల పెంచలమ్మ, ఏసీఎస్సార్‌కాలనీ, ఆత్మకూరు

ఇంటి వద్దే ఇవ్వాలి



కూలీ పనులకు వెళితేనే కుటుంబం జరుగుతుంది. రేషన్ దుకాణం వద్దకు వెళ్లాలంటే రానుపోను ఆరు కిలోమీటర్ల దూరం ఉంది. రేషన్ దుకాణం వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే ఒకరోజు కూలీ పనులు మానుకోవాల్సిందే. ఇప్పటి వరకు ఇస్తున్నట్లుగానే ఇంటి వద్దే సరుకులు ఇవ్వాలి.

– సూర్య రమాదేవి, బీసీకాలనీ, తిరుమనతిప్ప, సంగం

పునరాలోచించాలి



కిలోమీటర్ దూరంలోని ఎస్సీకాలనీకి ప్రతి నెలా రేషన్ సరుకులు ఇంటికే ఇస్తుండడం ప్రభుత్వ మంచి నిర్ణయానికి నిదర్శనం. మహిళల కష్టాలు తప్పించేందుకే అప్పట్లో ప్రభుత్వం వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు అందజేసింది. ఇప్పటి ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడం దారుణం. పునరాలోచించాలి.

– కే చైతన్య, కుప్పురుపాడు, ఏఎస్‌పేట మండలం

మాలాంటి వాళ్లకు కష్టం



మా కాలనీకి సంబంధించిన రేషన్ షాపు టౌన్‌లో ఉంది. అక్కడకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే కష్టం. నడవలేని నాలాంటి వారి అవస్థలను గుర్తించాలి. ఇంతకు ముందులాగా ఇంటి దగ్గరే రేషన్ సరుకులు ఇవ్వాలి.

–ఊటుకూరు నరసమ్మ, ఏసీఎస్‌ఆర్‌కాలనీ, ఆత్మకూరు

ఐదు కిలోమీటర్లు వెళ్లాలి



మా గ్రామంలో రేషన్‌దుకాణం లేదు. ఐదు కిలోమీటర్ల దూరంలోని బిల్లుపాడుకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. గ్రామం నుంచి బస్సులు లేవు. రేషన్ బండిని రద్దు చేస్తే ప్రతి నెలా మాకు నడక కష్టాలు తప్పవు.

–నేలటూరి వెంకటమ్మ, యనమదల, చేజర్ల మండలం

వాహనాల ద్వారా రేషన్ అందించాలి



ప్రస్తుతం అమలుచేస్తున్న పద్ధతిలోనే రేషన్ సరుకులు ఇంటింటికీ పంపిణీ చేయాలి. అదే రేషన్ డీలర్లయితే మేము మూడు కి.మీ పైగా నందిపాడుకు వెళ్లాల్సివస్తుంది. వ్యయ ప్రయాసలకోర్చి గతంలో చాలా ఇబ్బందులు పడ్డాము. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

– దొరసాల ప్రశాంతి, రెడ్లదిన్నె

మమ్మల్ని ఇబ్బంది పెట్టడమే



మా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. గతంలో పొలాల్లో అడ్డంగా నడిచి ఇనగలూరుకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేవాళ్లం. నాలుగేళ్లుగా ఆ ఇబ్బందులు తప్పాయి. మళ్లీ ఈ గవర్నమెంట్ దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలనడం మాలాంటి వాళ్లను ఇబ్బందులు పెట్టడమే.

– విజయమ్మ, గార్లదిన్నెపాడు, అనంతసాగరం మండలం

పస్తులు తప్పవేమో



ఈ వయస్సులో ఇనగలూరుకు నడిచి వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవడం నా వల్ల కాదు. మా గ్రామం నుంచి ఇనగలూరుకు బస్సులు, ఆటోలు కూడా లేవు. నడిచే వెళ్లాలి. ఇప్పటి వరకు ఇస్తున్న మాదిరే ఇంటి వద్దే రేషన్ సరుకులు ఇస్తే మంచిది. లేకపోతే నాబోటి ముసలోళ్లు పస్తులుండాల్సి వస్తోంది.

– బొల్లం పెద్దక్క, గార్లదిన్నెపాడు, అనంతసాగరం మండలం

రెండు కి.మీ. నడవాలి



గ్రామానికి దూరంగా ఉన్న తమలాంటి వారికి రేషన్ డోర్ డెలివరీ ఎంతో ఊరటనిస్తుంది. రేషన్ బండిని రద్దు చేస్తే ఎలా? రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే తలకు మించిన భారమవుతుంది. తమలాంటి వారి కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డోర్ డెలివరీ రద్దు నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి.

– నవరం అల్లూరమ్మ, గుండుపల్లి ఎస్టీ కాలనీ

మళ్లీ కష్టాలు మొదలు



గతంలో తాము ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతూ సుదూరంగా ఉన్న రేషన్‌షాపు నుంచి సరుకులు తెచ్చుకునే వాళ్లం. గత ప్రభుత్వం రేషన్ డోర్‌డెలివరీ ప్రారంభించడంతో తిప్పలు తప్పాయి. ప్రస్తుత ప్రభుత్వం రేషన్ బండ్లను రద్దు చేస్తామని చెప్పడం విచారకరం. అదే జరిగితే తమకు మళ్లీ పాత కష్టాలు మొదలైనట్లే.

–మేకల అంకమ్మ, గుండుపల్లి ఎస్టీ కాలనీ

ఇంటి వద్దే సరుకులివ్వాలి



ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఆపమనడం దారుణం. మాలాంటి వృద్ధులు షాపుల వద్దకు పోయి రేషన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందిపడతారు. నా వయస్సు 70 ఏళ్లు, నేను షాపు వద్దకు పోయి బియ్యం తెచ్చుకోలేను. ఇక ఎవరినైనా బతిమిలాడుకోవాలి. ఇంటి వద్దే సరుకులు ఇవ్వాలి.

– వీరెల్ల చంద్రయ్య,చింతలదేవి

కక్ష సాధింపు చర్యలను సహించబోం

- కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న రామిరెడ్డి

కావలి: ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి అభివృద్ధి చేస్తామంటే సహకరిస్తామని, కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటి వారినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి ఎమ్మెల్యేగా దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గెలుపొందడాన్ని స్వాగతిస్తున్నామని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పట్టణంలో మందాటి చెరువు వద్ద నాయీబ్రాహ్మణులు, భవన నిర్మాణ కార్మికులు, విశ్రాంత సైనికులకు కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు కేటాయిస్తే, వాటిలో చేపట్టిన నిర్మాణాలను కూల్చేయడం దారుణమన్నారు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు 125 ఎకరాలను ఆక్రమించారని పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని, వాస్తవమైతే సర్వేనంబర్లతో సహా కావలి ఆర్డీఓ ద్వారా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో అక్రమ లేవుట్లు వేస్తుండగా, వాటిని అరికట్టి తమ ప్రభుత్వ హయాంలో నుడా అనుమతులతో మౌలిక వసతులు కలిగిన లేఅవుట్లను ప్రోత్సహించామని గుర్తుచేశారు.ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని, బాలకృష్ణారెడ్డినగర్ పక్కనున్న లేఅవుట్ ఆయనదేనని, దాని పరిస్థితిని సమగ్రంగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేకు ఆక్రమణల తొలగింపుపై చిత్తశుద్ధి ఉంటే టీడీపీ నాయకుడు నాయుడు రాంప్రసాద్ చెరలో ఉన్న కావలి పెద్ద చెరువుకు సంబంధించిన 25 ఎకరాల భూమికి విముక్తి కల్పించాలని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ హయాంలో ట్రంకు రోడ్డు విస్తరణకు ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించామని గుర్తుచేశారు. మద్దూరుపాడు వద్ద 20 అడుగుల మేర స్థలం వదిలేసి డ్రైనేజీలు నిర్మిస్తున్నారని, దాని వల్ల రోడ్డు విస్తరణ తగ్గిపోతుందని, వదిలిన స్థలం కబ్జాకు గురవుతుందన్నారు. దానిని సరిచేసి యథావిధిగా డ్రైనేజీలు నిర్మించాలని సూచించారు. తాను గెలిచిన మూడు రోజుల్లోనే తన సొంత నిధులతో తుమ్మలపెంట రోడ్డు వేయిస్తానని చెప్పిన ఎమ్మెల్యే కృష్ణారెడ్డి రెండు నెలలు కావస్తున్నా ఎందుకు చర్యలు లేవన్నారు. చిరుద్యోగులను తొలగించి వారి కడుపు కొట్టడం బాధాకరమన్నారు. గతంలో తాము ఎక్కడా ఇలాంటి ఉద్యోగులను తొలగించలేదని,చిరుద్యోగులకు అండగా నిలుస్తామని, తొలగించిన అధికారులపై కోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు దామవరం వద్ద విమానాశ్రయం నిర్మిస్తామని శంకుస్థాపన చేశారని, అందుకు కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి వెంకట నారాయణ, బోగోలు , అల్లూరు మండలాల కన్వీనర్లు మద్దిబోయిన వీర రఘుయాదవ్, బీద రమేష్, నాయకులు నీలం సాయికుమార్, కుందుర్తి శ్రీనివాసులు, కొమారి రాజు,పరుసు మాల్యాద్రి పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



కావలి: టీడీపీ నాయకుల దాడుల్లో గాయపడిన, ఆస్తులను పోగొట్టుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. బాధితులకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన ఆర్థిక సాయాన్ని అందజేశారు. పట్టణంలోని 34 వ వార్డుకు చెందిన గుర్రంకొండ రాజీవ్‌కుమార్‌కు రూ.50వేలు, దగదర్తి మండలం తడకలూరుకు చెందిన షేక్ అమీర్‌బీకు రూ.50వేలు, ఆత్మకూరు గిరినాయుడుకు రూ.50వేలు, కాంద్ర శ్రీనివాసులుకు రూ.లక్ష నగదు చెక్‌లు అందజేశారు.

పలువురికి పరామర్శ

వయోభారం, అనారోగ్య సమస్యలతో దగదర్తిలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తాళ్లూరు రమణయ్య నాయుడు, అనారోగ్యంతో మృతి చెందిన రుద్రకోటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవళ్ల రమణయ్య, కుమారుడ్ని పోగొట్టుకున్న వైకుంఠపురానికి చెందిన నాయకుడు భీమవరపు వెంకయ్య, అనారోగ్యంతో బాధపడుతున్న దేవిరెడ్డి శేషారెడ్డి, మాతృమూర్తిని పోగొట్టుకున్న వైఎస్సార్‌సీపీ బూత్ సభ్యుడు మద్దులూరి కిరణ్, గౌరవరం టోల్‌ప్లాజా వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి అక్షిత్ సాయిని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పరామర్శించారు.

భూముల నష్టపరిహారం పెంచాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

సీతారామపురం: ఎన్‌హెచ్ 167–బీజీ నిర్మాణానికి సేకరించిన భూములకు సంబంధించి నష్టపరిహారాన్ని పెంచాలని సింగారెడ్డిపల్లి, నాంచారంపల్లి, సంగసానిపల్లి గ్రామాలకు చెందిన బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బూచిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణదారులు ఎకరాకు రూ.5.14 లక్షల నష్టపరిహారం అందజేశారని తెలిపారు. సమీపంలోని కుర్రపల్లి ప్రాంతానికి చెందిన రైతులకు ఎకరాకు రూ.29 లక్షల వరకు పరిహారం అందజేశారని గుర్తుచేశారు. తమవి సారవంతమైన మాగాణి భూములైనందుకు ఎకరాకు రూ.30 లక్షల వరకు నష్టపరిహారం అందించాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టాలని ఆత్మకూరు ఆర్డీఓకు సూచించినట్లు బాధిత రైతులు తెలిపారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



అల్లూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ జ్యోతి



ఆత్మకూరురూరల్ మండలం మహిమలూరులో..

అల్లూరు: మండలంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరులోని రామకృష్ణ జూనియర్ కళాశాల నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపీడీఓ జ్యోతి ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఆగస్టు 15 వరకు ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే గోగులపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మెయిన్ కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మువ్వన్నెల జెండాతో ర్యాలీలు నిర్వహించారు. మహిమలూరులో జరిగిన కార్యక్రమంలో ఆత్మకూరు ఎంఈఓ–2 చలపతి, సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరిలో అధికారులు, సచివాలయ సిబ్బంది విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. స్థానిక దళితవాడ పాఠశాల నుంచి ఇండియన్ పెట్రోల్ బంకు వరకు మువ్వన్నెల జెండాతో ర్యాలీ చేపట్టారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓ తోట శ్రీనివాసుల, ఈఓపీఆర్డీ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల :అనంతసాగరం, చిలకలమర్రిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలను ఘనంగా నిర్వహించారు. అనంతసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బద్వేల్ సెంటర్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బట్రెడ్డి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు. చిలకలమర్రిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సమరయోధుల చిత్రపటాలు, జాతీయ జెండాలు చేతపట్టి భారీ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, రమణరాజు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, శివకృష్ణ పాల్గొన్నారు.

భూ వివాదంపై విచారణ

సీతారామపురం: మారంరెడ్డిపల్లి పంచాయతీలోని సర్వే నంబర్ 190–2లోని 6.32 ఎకరాల మాన్యం భూమి వివాదంపై తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. మారంరెడ్డిపల్లిలో గ్రామసభ ఏర్పాటు చేసి అటు రజకులు, ఇటు దళితులను పిలిపించి బహిరంగ విచారణ జరిపారు. ఇరువర్గాలు తమ వాదనలను వినిపించి సంబంధిత పత్రాలను రెవెన్యూ అధికారులకు అందజేశారు. రికార్డుల ప్రకారం నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేసి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శ్రావణి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎంఈఓ సురేష్, కలిగిరి, దుత్తలూరు పాఠశాలల ప్రిన్సిపాళ్లు శ్రీను, సైమన్, కలిగిరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భీమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు అనుమానిత కేసుల పరిశీలన

సోమశిల: అనంతసాగరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జూలై 18 నుంచి చేపట్టిన ఇంటింటి కుష్టు సర్వేలో గుర్తించిన అనుమానితుల్ని డీపీఎం మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. ఐదుగురికి కుష్టు వ్యాధి తొలి దశలో ఉన్నట్లు నిర్ధారించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణి డీపీఎంకు వివరించారు. వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ తెలిపారు.